క్లుప్తంగా

వెంకటేశ్వరస్వామికి ధనుర్మాస పూజలు



పూజల్లో పాల్గొన్న భక్తులు

పొదలకూరు: పట్టణంలోని శ్రీలక్ష్మీ గోదాదేవి సమేత వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం తెల్లవారుజామున ధనుర్మాస పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరస్వామి, శ్రీలక్ష్మీ గోదాదేవి అమ్మవార్లకు అభిషేకాలు, ప్రత్యేక అలంకరణ, విశేష పూజలు నిర్వహించారు. పలువురు దంపతులు పూజల్లో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

నేడు మంత్రి కాకాణి పొదలకూరుకు రాక

పొదలకూరు: రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి సోమవారం ఉదయం 10 గంటలకు పట్టణంలోని డీఎన్నార్ జెడ్పీ బాలుర హైస్కూల్‌కు రానున్నట్లు ఎంపీడీఓ నగేష్‌కుమారి ఆదివారం తెలిపారు. పాఠశాలలో జరిగే ఓ ప్రైవేటు కార్యక్రమంలో మంత్రి పాల్గొంటారని తెలిపారు.

నేడు ముత్తుకూరులో 'గడప గడపకు..'

ముత్తుకూరు: ముత్తుకూరులో సోమవారం సాయంత్రం 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మెట్ట విష్ణువర్ధన్‌రెడ్డి ఆదివారం తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పాల్గొంటారని, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

వెంకటాచలం: బైక్ పడిపోయి వ్యక్తి గాయపడిన ఘటన మండలంలోని కసుమూరులో ఆదివారం చోటుచేసుకుంది. గూడూరు పట్టణానికి చెందిన మునికృష్ణ పనినిమిత్తం బైక్‌పై కసుమూరుకు వెళుతుండగా, ఆటో అడ్డురావడంతో బైక్ అదుపుతప్పి పడిపోయింది. ఈ ప్రమాదంలో మునికృష్ణకు గాయాలు కాగా చికిత్సనిమిత్తం 108 వాహనంలో జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వెంకటాచలం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సేవలు మరువలేనివి



బుచ్చిరెడ్డిపాళెం: కామ్రేడ్ చంద్రగిరి రోశయ్య సేవలు మరువలేనివని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు జొన్నలగడ్డ వెంకమరాజు అన్నారు. ఆదివారం రోశయ్య వర్ధంతి సందర్భంగా బుచ్చిరెడ్డిపాళెంలోని జొన్నవాడ సెంటర్‌లో ఉన్న రోశయ్య స్థూపం వద్ద ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వెంకమరాజు మాట్లాడుతూ పేదల సమస్యల పరిష్కారానికి రోశయ్య నిత్యం పోరాడారని గుర్తుచేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు మల్లికార్జున, శ్రీనివాసులు, జానీబాషా, కోటయ్య, ప్రభాకర్, ప్రసాద్ పాల్గొన్నారు.

కోడిపందేల స్థావరాలపై దాడులు

కావలి రూరల్: మండలంలోని రాజువారి చింతలపాళెం, పెద్దవరం గ్రామాల మధ్యన అటవీ ప్రాంతంలో కోడిపందేలు నిర్వహిస్తున్నారనే సమాచారంతో రూరల్ ఎస్సైలు ఎం వెంకటరావు, జీ వీరేంద్రబాబు తమ సిబ్బందితో ఆదివారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 12 మంది పందెంరాయుళ్లను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి మూడు కోళ్లు, రూ.15,500 నగదు స్వాధీనం చేసుకున్నారు.

ఆరుగురు జూదరుల అరెస్ట్

మర్రిపాడు: మండలంలోని సింగనపల్లి గ్రామ సమీపంలో కోడిపందేల స్థావరం నిర్వహిస్తున్నారనే సమాచారంతో ఆత్మకూరు సీఐ నాగేశ్వరరావు నేతృత్వంలో పోలీసు సిబ్బంది ఆదివారం సాయంత్రం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ఆరుగురు జూదరులను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.2,150 నగదు, నాలుగు కోళ్లు, ఆరు బైక్‌లు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా సీఐ నాగేశ్వరరావు మాట్లాడుతూ సంక్రాంతి సందర్భంగా కోడిపందేలు, జూదాలు నిర్వహిస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

అదుపుతప్పిన అంబులెన్స్

ఉదయగిరి: సీతారామపురం వైపు వెళ్తున్న ఓ ప్రైవేట్ అంబులెన్స్ అదుపుతప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొని రోడ్డుపక్కనున్న ఇంట్లోకి దూసుకెళ్లింది. ఈ ఘటన మండలంలోని కుర్రపల్లి సమీపంలో శనివారం రాత్రి చోటుచేసుకుంది. వివరాలు..ఉదయగిరికి చెందిన శ్యాంసుందర్ తన ప్రైవేట్ అంబులెన్స్ వాహనంలో సీతారామపురానికి వెళుతుండగా కుర్రపల్లి సమీపంలో వాహనం అదుపుతప్పి ప్రమాదం జరిగింది. వాహనంలోని ఎయిర్‌బ్యాగులు తెరుచుకోవడంతో శ్యాంసుందర్ స్వల్పగాయాలతో బయటపడ్డాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు

- కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

బుచ్చిరెడ్డిపాళెం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో కులమతాలు, రాజకీయాలకు అతీతంగా, అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి తెలిపారు. బుచ్చిరెడ్డిపాళెంలోని 3వ వార్డులో ఆదివారం 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో పింఛన్ తీసుకుంటున్న వ్యక్తి మృతిచెందితేనే మరొకరికి పింఛన్ మంజూరయ్యేదని, కానీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్ అందించేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చర్యలు తీసుకున్నారని తెలిపారు. సంక్షేమ పథకాల అమలు విషయంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం దేశంలోని అన్ని రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తోందన్నారు. ప్రతిపక్షపార్టీ నేతలకు కూడా సంక్షేమ ఫలాలను అందించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా 7 పొదుపు సంఘాల సభ్యులకు రూ.కోటి బ్యాంకు రుణాల చెక్కులను అందజేశారు. వవ్వేరు గ్రామానికి చెందిన రాగి చెంచమ్మకు వైఎస్సార్ బీమా కింద రూ.90 వేల నగదును అందజేశారు.



సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

వైఎస్సార్‌సీపీలో చేరిక

మండలంలోని ఇస్కపాళెం పంచాయతీలో పల్లాప్రోలు గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు దాదాపు 20 మంది ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను చూసి చాలా మంది టీడీపీ నేతలు వైఎస్సార్‌సీపీలో చేరుతున్నారని, తమ పార్టీలో వారికి సముచితస్థానం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో నగర పంచాయతీ కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపీడీఓ నరసింహారావు, ఏపీఎం లలిత, వైస్ చైర్‌పర్సన్లు కాటంరెడ్డి లలిత, షాహుల్, కౌన్సిలర్లు అందె ప్రత్యూష, షకీల, సత్యనారాయణ, యానాదిరెడ్డి, మల్లారెడ్డి, అనంతమ్మ, ప్రమీలమ్మ, నాగరాజు, లక్ష్మీకాంతమ్మ, రహమత్, జయంతి, శ్రీదేవి, నాయకులు విల్సన్, ఆదిశేషయ్య పాల్గొన్నారు.



వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

23 నుంచి విగ్రహ ప్రతిష్ట ఉత్సవాలు



విగ్రహ ప్రతిష్ట ఉత్సవాలకు సిద్ధమవుతున్న కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయం

పొదలకూరు: పట్టణంలోని అయ్యప్పనగర్‌లో నిర్మాణ పనులు పూర్తయిన శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 23 నుంచి 27వ తేదీ వరకు విగ్రహ ప్రతిష్ట ఉత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ బోయిళ్ల మాలకొండారెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఈ ఉత్సవాల్లో ధ్వజస్తంభం, ద్వారపాలక, లక్ష్మీగణపతి, నర్మదాబాణలింగం, అయ్యప్పస్వామి, అభయాంజనేయస్వామి, గరుడాళ్వార్, విమానకలశం ప్రతిష్ట, మహారాజ సంప్రోక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 23న విశ్వక్సేణ ఆరాధన, 24న పుణ్యాహవచనం, అభిషేకాలు, సాయంత్రం ఆలయ ప్రవేశం, 25న వాస్తు హోమం, కలశ ప్రతిష్ట, సాయంత్రం అగ్నిప్రతిష్ట ఆరాధన, హోమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 26న ప్రధాన నిత్యహోమాలు, పూజలు, ఉదయం ధ్వజస్తంభ ప్రతిష్ట, కలశ ప్రతిష్ట, సాయంత్రం మహాశాంతి అభిషేకం, 27న తెల్లవారుజాము నుంచి యంత్ర ప్రతిష్ట, స్వామివారి విగ్రహ ప్రతిష్ట, మహాపూర్ణాహుతి, కుంభాభిషేకం, గోదర్శనం, దివ్యదర్శనం హారతి నిర్వహించనున్నట్లు తెలిపారు. విగ్రహ ప్రతిష్ట మహోత్సవాల సందర్భంగా ప్రతినిత్యం మధ్యాహ్నం, రాత్రి భక్తులకు అన్నదానం నిర్వహిస్తామని తెలిపారు. ఈ ఉత్సవాలు గాలిపాళెం చినవెంకయ్యస్వామి ఆధ్వర్యంలో జరుగుతాయని తెలిపారు.

ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం

కొడవలూరు: వైఎస్సార్‌సీపీ తూర్పు రాయలసీమ పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డి తరపున మండలంలోని రామన్నపాళెంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఆదివారం ముమ్మర ప్రచారం నిర్వహించారు. పట్టభద్రుల ఓటర్లను ఇంటింటికీ వెళ్లి కలిసి కరపత్రాలు, క్యాలెండర్లు అందజేసి పేర్నాటిని గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ నాయకుడు కాకి శ్రీనివాసులు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ తరపున పేర్నాటిని ఎమ్మెల్సీగా గెలిపించుకోవాల్సిన బాధ్యత నాయకులందరిపై ఉందన్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో ఉన్న పట్టభద్రులను కలిసి పేర్నాటిని గెలిపించుకొంటామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పి.సాయిమోహన్‌రెడ్డి, కె.శ్యాంసుందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



రామన్నపాళెంలో ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

కౌలు రైతులు సీసీఆర్‌సీలు పొందాలి

కొడవలూరు: మండలంలోని కౌలు రైతులు సీసీఆర్‌సీ(కౌలు కార్డు)లు పొందాలని ఏఓ సీహెచ్‌ఎస్ లక్ష్మి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించినందున కౌలు రైతులు ధాన్యం విక్రయాల కోసం విధిగా సీసీఆర్‌సీ పొందాలని తెలిపారు. అదేవిధంగా పంట నమోదు చేసుకొన్న రైతులు ఈ–కేవైసీ విధిగా చేయించుకోవాలని పేర్కొన్నారు. పంట నమోదు అనంతరం ఈ–కేవైసీ చేసుకొన్న రైతులు మాత్రమే కొనుగోలు కేంద్రాల్లో విక్రయాలకు అర్హులని తెలిపారు. మండలంలో పంట నమోదు బాగా వెనుకబడి ఉన్నందున రైతులు పంట నమోదుపై ఆసక్తి చూపాలని తెలిపారు. ఆర్బీకేల్లో సంప్రదించి పంట నమోదు చేయించుకోవాలని పేర్కొన్నారు.

ఉచిత వైద్యశిబిరం

సోమశిల: అనంతసాగరం మండలం రేవూరులో ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. గ్రామానికి చెందిన ప్రముఖ వైద్యనిపుణులు డాక్టర్ మాదమాల ప్రమీల రాంగోపాల్‌రెడ్డి 400 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. బీపీ, షుగర్, తదితర దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న రోగులకు మూడు నెలలకు సరిపడా మందులు ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో కాకూరు రామలింగారెడ్డి, కేతా సుబ్బారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వస్త్రాల అందజేత

నెల్లూరు రూరల్: పడారుపల్లిలోని అభయాంజనేయస్వామి ఆలయ ద్వితీయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని పేదలకు వస్త్రాలను వైఎస్సార్ సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, మేయర్ స్రవంతి ఆదివారం అందజేశారు. కార్పొరేటర్ శ్రీనివాసులురెడ్డి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు పుల్లారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అనిల్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): రానున్న ఎన్నికల్లోనూ నెల్లూరు నగర ఎమ్మెల్యేగా అనిల్‌కుమార్‌యాదవ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని 14వ డివిజన్ కార్పొరేటర్ కర్తం ప్రతాప్‌రెడ్డి పేర్కొన్నారు. డివిజన్ ప్రముఖులతో ఆత్మీయ సమావేశాన్ని వికాస్ స్కూల్లో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. డివిజన్లో ఎన్నో సంక్షేమ కార్యక్రమాలను ఎమ్మెల్యే అనిల్ చేపట్టారని చెప్పారు. అనంతరం సచివాలయ కన్వీనర్లుగా ఎంపికైన వారు, నామినేటెడ్ పదవులు పొందిన వారిని సత్కరించారు.

అలరించిన అష్టావధానం



నెల్లూరు(బృందావనం): పురమందిర ప్రాంగణంలోని ఏసీ హాల్లో గౌరీభొట్ల రామశర్మ అష్టావధానాన్ని పద్యకళాపరిషత్ అధ్యక్షుడు రామచంద్రప్రసాద్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. తొలుత దీపప్రజ్వలన చేశారు. అనంతరం సమాజంలోని ఎన్నో అంశాలను స్పృశిస్తూ ఎందరో కవులు తమ వినూత్న కవితలను చదివి వినిపించారు. వేద సంస్కృత కళాశాల విశ్రాంత ఆంధ్రోపన్యాసకురాలు గిరిజాలక్ష్మి అధ్యక్షతన కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రముఖ సాహితీవేత్త మా శర్మ, విశ్రాంత ఆచార్యుడు సూరం శ్రీనివాసులు, అగస్త్యరాజు సుబ్బారావు, వైద్యుడు సింగరాజు రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఏపీఎస్‌ఈబీ నూతన డైరీ ఆవిష్కరణ

ముత్తుకూరు: ఏపీఎస్‌ఈబీ 2023 సంవత్సరం డైరీని ఆదివారం నేలటూరులోని ఏపీజెన్‌కో కాలనీలో ఉన్న ఫంక్షన్ హాల్‌లో ఆవిష్కరించారు. ఆల్ ఇండియా పవర్ ఇంజినీర్స్ ఫెడరేషన్ చైర్మన్ శైలేంద్ర దూబీ ముఖ్యఅతిథిగా పాల్గొని నూతన డైరీని ఆవిష్కరించారు. ప్రధాన కార్యదర్శి రత్నాకర్‌రావు, వైస్ చైర్మన్లు జయంతి, వేదవ్యాసరావు, ఏపీఎస్‌ఈబీ ఇంజినీర్స్ అసోసియేషన్ అడిషనల్ సెక్రటరీ జనరల్ రత్నాలరావు, ప్రధాన కార్యదర్శి ప్రతాపరెడ్డి, అసోసియేట్ ప్రెసిడెంట్ నాగప్రసాద్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇంజనీర్లు, ఉద్యోగులు ఐకమత్యంతో సమస్యలు పరిష్కరించుకోవాలని విజ్ఞప్తి చేశారు.



డైరీని ఆవిష్కరిస్తున్న దృశ్యం

అయ్యప్ప భక్తుల నిరసన ర్యాలీ

వెంకటాచలం: హిందూ దేవుళ్లపై భైరి నరేష్ చేసిన అనుచిత వాఖ్యలకు నిరసనగా మండలంలోని నిడిగుంటపాళెం గ్రామంలో శబరిమల అయ్యప్ప సేవా సమాజం ఆధ్వర్యంలో అయ్యప్పస్వామి భక్తులు ఆదివారం ర్యాలీ నిర్వహించారు. హిందూ దేవతలను హేళన చేస్తూ సనాతన ధర్మాలను, హిందూ దేవుళ్లపై అనుచిత వ్యాఖ్యలు చేసిన భైరి నరేష్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ర్యాలీలో పాలూరు రాము, మల్లికార్జునరెడ్డి, నడవల శ్రీనివాసులు, కొలంగిరి సుధాకర్, అసనాపురం శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



నినాదాలు చేస్తున్న అయ్యప్పస్వామి భక్తులు

రంగడి దేవస్థానంలో రాపత్తు ఉత్సవం

నెల్లూరు(బృందావనం): అధ్యయనోత్సవాలను పురస్కరించుకొని నగరంలోని తల్పగిరి రంగనాథస్వామి దేవస్థానంలో రాపత్తు ఉత్సవాన్ని నేత్రపర్వంగా ఆదివారం నిర్వహించారు. దేవస్థాన ప్రధానార్చకులు జగన్నాథాచార్యులు, సుదర్శనాచార్యులు ఆధ్వర్యంలో పూజలు చేశారు. ఉభయకర్తగా వెంకటసుబ్బయ్యశెట్టి వ్యవహరించారు. ఈఓ వెంకటేశ్వర్లు, ధర్మకర్తల మండలి చైర్మన్ శివకుమార్ ఆచారి, తదితరులు పాల్గొన్నారు.



ఆటోడ్రైవర్‌పై దాడి

నెల్లూరు(క్రైమ్): ఆటోడ్రైవర్‌పై కొందరు దాడి చేసిన ఘటనపై వేదాయపాళెం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. కొత్తూరులోని వైఎస్సార్‌నగర్‌లో నివాసం ఉంటున్న సుబ్బరాయుడు ఆటో నడుపుకొని జీవనం సాగిస్తున్నారు. నగరానికి చెందిన ఇస్మాయిల్ ఈయన స్నేహితుడు. ఇస్మాయిల్ తన భార్యతో విడిపోయి దూరంగా ఉంటున్నారు. ఈ క్రమంలో వారం క్రితం స్నేహితుడి భార్యతో ఫోన్లో సుబ్బరాయుడు మాట్లాడి.. విభేదాలను వీడి కాపురాన్ని చక్కదిద్దుకోవాలని కోరారు. ఈ తరుణంలో ఆటోలో సుబ్బరాయుడు వెళ్తుండగా, డెయిరీ వద్దకు వచ్చేసరికి శ్రీను, సురేష్, బన్నీ, రాజేష్ అటకాయించారు. ఆమెతో ఫోన్లో లేనిపోని మాటలు ఎందుకు మాట్లాడుతున్నావు.. తమ గురించి ఎందుకు చెప్తున్నావంటూ దాడి చేశారు. గాయపడిన సుబ్బరాయుడు చికిత్స నిమిత్తం జీజీహెచ్‌లో చేరారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

రబీలో కలుపు నివారణ చర్యలు కీలకం



వరి పంటలో కలుపు తీస్తున్న మహిళా కూలీలు

- వరి పంటలో పెరుగుతున్న కలుపు
- ప్రాథమిక దశలోనే చర్యలు తీసుకోవాలంటున్న వ్యవసాయాధికారులు

బుచ్చిరెడ్డిపాళెం: మండలంలోని రబీ వరిసాగులో కలుపు నివారణ చర్యలు కీలకమని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. వ్యవసాయ ప్రాధాన్యంగా ఉన్న కోవూరు నియోజకవర్గంలోని విడవలూరు, బుచ్చిరెడ్డిపాళెం, కోవూరు, కొడవలూరు, ఇందుకూరుపేట మండలాల్లోని అన్ని గ్రామాల్లో సుమారు 71 వేల ఎకరాల్లో వరిపంట సాగవుతోంది. అయితే వరి పంటలో కలుపు అధికం కావడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పొలాల్లో కలుపు అధికంగా ఉన్న కారణంగా పెట్టుబడులు అధికమవుతున్నాయని రైతులు వాపోయారు. ఆరంభంలోనే కలుపు నివారణకు తగిన చర్యలు తీసుకోని కారణంగా ప్రస్తుతం కలుపు ఏపుగా పెరుగుతుందని తెలుస్తోంది. దీంతో వరిసాగు ప్రాథమిక దశలోనే రైతులు కలుపు నివారణ చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. ముఖ్యంగా రబీలో గడ్డిజాతి, వెడల్పాకు, తుంగ వంటి మూడు జాతులకు చెందని కలుపు వస్తుందని, వీటి నివారణకు చర్యలు చేపట్టాల్సి ఉందని వ్యవసాయాధికారులు చెబుతున్నారు.

నివారణ చర్యలు

నారుమడులు వేసిన 14 రోజులకు ఒక లీటరు నీళ్లలో రెండు మిల్లీలీటర్ల సైహలోపాప్‌బ్యూటైల్(క్లించర్)అనే కలుపు నివారణ మందును కలిపి పిచికారీ చేయాలని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. వరినాట్లు వేసిన తరువాత 3 నుంచి 5 రోజుల వరకు ఎకరాకు 35 నుంచి 40 గ్రాముల ఆక్సిడైయార్జిల్ లేదా 500 మిల్లీలీటర్ల పెట్రాకోల్‌ను 20 కేజీల ఇసుకలో కలిపి చల్లాలి. అయితే ఈ సమయంలో వరినాట్లు వేసిన పొలాల్లో ఒక ఇంచ్ నీటిమట్టం తప్పనిసరిగా ఉండాలి. వరి నాట్లు వేసిన 15 రోజుల తరువాత ఎకరాకు 80 నుంచి 100 మిల్లీలీటర్ల నామినీగోల్డ్ అనే కలుపు నివారణ మందును పిచికారీ చేయాల్సి ఉంది. అదే వరి నాటిన 20 నుంచి 30 రోజుల వరకు గడిస్తే ఒక లీటర్ నీటిలో ఒక గ్రాము డిసోడియం సాల్ట్ అనే కలుపు నివారణ మందు కలిపి పిచికారీ చేయాల్సిఉంది. ఇలా చేసే సమయంలో ఎకరాకు 200 లీటర్ల నీటిని వినియోగించాల్సి ఉంది. ఇలా చేయడం వల్ల కలుపును నివారించి రైతులు అధిక దిగుబడులను సాధించవచ్చని వ్యవసాయాధికారులు చెబుతున్నారు.

కలుపు నివారణపై అవగాహన కల్పిస్తున్నాం



రబీ సీజన్‌లో వరి సాగు చేస్తున్న రైతులు కలుపు నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తున్నాం. అలాగే కలుపు నివారణకు వాడాల్సిన మందులతోపాటు వాటిని ఏ విధంగా పిచికారీ చేయాలో కూడా తెలుపుతున్నాం. కలుపు నివారణ వల్ల అధిక దిగుబడులు సాధించవచ్చు.

– వెంకటకృష్ణయ్య, ఏఓ, విడవలూరు

కేజ్‌వీల్స్‌తో రహదారులు ధ్వంసం

- పట్టించుకోని అధికారులు

పొదలకూరు: మాగాణి పొలాలను దుక్కులు చేసే కేజ్‌వీల్స్ రహదారులపై తిరగడం వల్ల మండలంలోని తారురోడ్లు ధ్వంసమవుతున్నాయి. రైతులు అవగాహన రాహిత్యంతో గ్రామీణ ప్రాంతాల్లోని రోడ్లు తుక్కుతుక్కవుతున్నాయి. రైతులు వరినాట్ల కోసం మాగాణి భూములను కేజ్‌వీల్స్‌తో తొక్కిస్తుంటారు. అయితే కేజ్‌వీల్స్‌ను ట్రాక్టర్ ట్రక్‌లో తరలించుకువెళ్లి మాగాణి పొలాల్లో దింపుకుని సేద్యం పనులు పూర్తయిన తర్వాత తిరిగి చక్రాలను ట్రాక్టర్ ట్రక్‌లోనే తరలిస్తే ఈ సమస్య తొలగుతుంది.

అయితే ఇళ్ల వద్ద నుంచే కేజ్‌వీల్స్‌ను ట్రాక్టర్‌కు బిగించి తారురోడ్లపై వెళుతుండడంతో రోడ్లు దెబ్బతింటున్నాయి. ఇనుప చక్రాల బరువు, ఒత్తిడి వల్ల రోడ్లు కంకర తేలిపోతున్నాయి. క్రమంగా రోడ్లపై గుంతలు పడి ప్రయాణించేందుకు వీలులేనంతగా మారుతున్నాయి. దీనికి వర్షాలు తోడవుతుండడంతో రోడ్లు బాగా దెబ్బతింటున్నాయి. కేజ్‌వీల్స్‌తో ట్రాక్టర్లను రోడ్లపై తిప్పకూడదనే నిబంధనలు ఉన్నా అమలు కావడం లేదు. ఇటీవల నిర్మాణం పూర్తయిన గ్రామీణ ప్రాంతాల తారురోడ్లు కూడా దెబ్బతింటున్నాయి.



తారురోడ్డుపై వెళుతున్న కేజ్‌వీల్స్

స్వయం నియంత్రణ అవసరం

రైతులు స్వయం నియంత్రణ పాటించి రహదారులను పరిరక్షించుకోవాల్సిన అవసరం ఉంది. నిబంధనలు పాటించి కేజ్‌వీల్స్‌ను ట్రాక్టర్లలో తరలిస్తే నష్టాన్ని నివారించవచ్చు.



దెబ్బతిన్న తారురోడ్డు

అనాథాశ్రమానికి రూ.45 వేల వితరణ



నెల్లూరు రూరల్: వేదాయపాళెంలోని స్వర్ణదీపం ట్రస్ట్ అనాథాశ్రమానికి రూ.45 వేల ఆర్థిక సాయాన్ని ఎస్వీఎస్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో ఆదివారం అందజేశారు. హరనాథపురంలోని స్కూల్లో నిర్వహించిన కార్యక్రమంలో ఈ మొత్తాన్ని ట్రస్ట్ నిర్వాహకుడు రఫీకి 25 కళాసంఘాల అధ్యక్షుడు అమరావతి కృష్ణారెడ్డి అందించారు. హైదరాబాద్‌కు చెందిన ఎమ్మెస్సార్ వృద్ధాశ్రమ నిర్వాహకుడు శ్రీనివాస్, ఎస్వీఎస్ స్కూల్ కరస్పాండెంట్ వెంకటేశ్వర్లురెడ్డి, హరిబాబు, అమీర్‌జాన్, హరనాథ్‌రెడ్డి, సుబ్బారెడ్డి, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు మందుల పంపిణీ

నెల్లూరు(బృందావనం): వికాస్ ఆరోగ్య దీపిక కార్యక్రమంలో భాగంగా పేదలకు మందులను ఉచితంగా ఆదివారం పంపిణీ చేశారు. బాలాజీనగర్‌లోని వికాస్ ప్రజాహిత సేవా సమితి కార్యాలయంలో సంస్థ వ్యవస్థాపకుడు, 14వ డివిజన్ కార్పొరేటర్ కర్తం ప్రతాప్‌రెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని చేపట్టారు. డాక్టర్ సాయి వినూత్న ఆధ్వర్యంలో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. శ్రీనివాసులురెడ్డి, హర్షవర్ధన్‌రెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరై రూ.50 వేల విలువైన మందులను పంపిణీ చేశారు.

